# గురుదక్షిణ

"అగ్రహారం"

కండక్టరు అరుపుకు సీట్లో కూర్చుని కునికి పాట్లు పడుతున్న దుర్గాప్రసాద్ ఉలిక్కిపడి లేచాడు. పైన పెట్టుకున్న సూట్ కేస్ తీసుకుని క్రిందికి దిగాడు.

బస్సు దుమ్ము రేపుకుంటూ వెళ్లిపోయింది. రోడ్డుప్రక్కవున్న చెట్ల మీద నుండి వచ్చిన పిల్ల తెమ్మెర అతడిని ఆప్యాయంగా తాకి, అభిమానానికి పేరయిన పరమేశం మాష్టారిని గుర్తుకు తెచ్చింది. ఆయన్ని ఎప్పుడెప్పుడు చూద్దామా అని అతని మనస్సు తహతహలాడింది.

వాచీ చూసుకున్నాడు. పదకొండు గంటలు అయింది. బస్సు మధ్యలో ట్రబులివ్వకుండా వుంటే రెండు గంటల ముందుగానే వచ్చేవాడు.

చైత్ర మాసపుటెండ కొద్దిగా చిరచిరలాడు తోంది. దుర్గాప్రసాద్ చుట్టూ చూశాడు. ఎక్కడా జనసంచారం లేదు.

ఫర్లాంగు దూరంలో ఒక చింతచెట్టు. దాని క్రింద చిన్న బడ్డీకొట్టు కన్పించాయి.

ఊళ్లోకి వెళ్ళాలంటే నాలుగుమైళ్ల ప్రయాణం చెయ్యాలి. సాధారణంగా వూళ్లోకి ప్రయాణీకుల కోసం బస్సు ఆగేచోట ఎద్దుబండ్లు గూడు రిక్షాలు వుండేవి, కానీ ఈ రోజు ఒక్కటి కూడా లేదు. ఎందుకనో? అనుకుంటూ దుర్గాప్రసాద్ బడ్డీకొట్టు దగ్గరికి వచ్చాడు.

కొట్టులో కూర్చున్న వ్యక్తి దుర్గాప్రసాద్‌ని చూసి లేచి నిలబడి "ఏం కావాలి సార్?" అని అడిగాడు.

"ఒక సోడా యివ్వు!

అతడు సోడా కొట్టిచ్చాడు. దుర్గాప్రసాద్ సోడా త్రాగాడు. డబ్బులిస్తూ-

"ఊళ్ళోకెళ్ళడానికి బండ్లేమీ లేవా?" అనడిగాడు.

"పక్కూళ్ళో సంబరాలు. బళ్ళన్నీ అక్కడికి పోయాయి. మళ్ళీ సాయంత్రానికి వస్తాయి"

సాయంత్రం సంగతి తనకెందుకు విసుక్కున్నాడు దుర్గాప్రసాద్. అయితే ఈ ఎండలో - ఒక పక్కన ఆకలి మండిపోతోంటే నడవాల్సిందే?

"ఎవరింటికెళ్ళాలి సార్?"

"బసవయ్యగారింటికి"

ఆ పేరు వినగానే అతడు కంగారుపడుతూ. "అలాగా సార్! పోనీ నా సైకిలు తీసుకెడతారా?" ఎంతో వినయంగా అడిగాడు.

నడకకంటే సైకిలే నయమేమో!

ఎప్పుడో కాలేజీలో చదివేటప్పుడు సైకిలు ఎక్కాడు. మళ్ళా ఇన్నాళ్ళకి... కానీ ప్రస్తుతం అంతకన్నా గత్యంతరం ఏముంది ?

" సరే ఇవ్వు?"

అతడు చెట్టునీడన పెట్టిన సైకిలు తీసుకొచ్చాడు.

"సాయంత్రం నేను బసవయ్యగారింటికొచ్చి తీసుకుంటాలెండి" అన్నాడు

దుర్గాప్రసాద్ సైకిలు తీసుకుని, వెనకాల సూట్‌కేస్ పెట్టాడు. రెండుసార్లు ప్రయత్నించాక సైకిలెక్కగలిగాడు నెమ్మదిగా తొక్కసాగాడు.

ఎన్నో ఏళ్ళ తర్వాత సైకిలు మీద ప్రయాణం. మనసు ఎన్నో ఏళ్ళ వెనక్కి వెళ్ళి, తనెంతో చిన్నవాడయినట్లు అనుభూతి కలిగిందతనికి.

ఊళ్ళోకి వెళ్ళే రోడ్డు పట్టాడు. చిన్నప్పుడు ఈ దారిమీదే తన స్నేహితులతో కలిసి కొన్నివందలసార్లు తిరిగాడు. అప్పుడీ తారురోడ్డు లేదు చిన్నకాలిబాట వుండేది. రోడ్డుకి రెండువేపుల తాడిచెట్లు వుండేవి. రోడ్డు వేయడానికి అడ్డువచ్చాయని కాబోలు వాటిని కొట్టేసినట్లున్నారు.

దుర్గాప్రసాద్ చుట్టూ చూశాడు. రోడ్డు క్రిందగా ఇరువైపులా వరి పొలాలు కన్పిస్తున్నాయి. తన చిన్నప్పుడివి మెట్టపొలాలు. ఎక్కువగా పెసర, మినుములు వేసేవారు.

తనకు పెసరకాయలంటే చాలా ఇష్టం. ఎవర్నూ చూడకుండా వాటిని కోసుకుని జేబులనిండా పోసుకునేవాడు. ఒకసారి తనూ తన ఫ్రెండు శీనూ కాయలు కోస్తుండగా నాయుడుగారు పట్టుకొని పరమేశం మాస్టారి దగ్గరకు తీసుకెళ్ళారు.

"మాస్టారూ ! మీ పిల్లలు మా చేలని నాశనం చేస్తున్నారు" అని చెప్పాడు

మాస్టారు తమవేపు చూస్తూ -

"ఏరా! కాయలు కోశారా ? తింటే కడుపునొప్పి రాదుట్రా!" అని మందలించాడు.

"ఇంకెప్పుడూ తినమండీ !"

"చూశారా నాయుడుగారూ! పిల్లలు మాట ఇచ్చారు. ఇక మీ చేనుకే ఆపదా రాదు. వెళ్ళండి" అన్నారు.

ఏదో భయపెడ్తారని ఎదురుచూసిన నాయుడికి మాస్టారి మాటలు కొంత అసంతృప్తి కలిగించినా ఆయనకెదురు చెప్పలేక వెళ్ళిపోయాడు.

ఆయన వెళ్ళాక, "ఏరా ప్రసాదూ ! పెసరకాయలు బాగున్నాయా ? కానీ రోజూ వెళ్ళకండిరా ! నాయుడు పూరుకోడు" అన్నారు మాస్టారు నవ్వుతూ.

పరమేశం మాస్టారు అగ్రహారంలో వున్న ఎలిమెంటరీ స్కూలు టీచరు. అయిదవ క్లాసుకు లెక్కలు చెబుతుండేవారు. అసలాయనకు తెలియని విషయమే లేదు. ఏ మాస్టారు రాకపోతే ఆ క్లాసు తీసుకుంటుండేవారాయన.

తనకు లెక్కలంటే భయం. ఎక్కాలు కూడా వచ్చేవి కావు.

ఒకరోజు క్లాసులో మాస్టారు ఆరో ఎక్కం అడిగారు. తను చెప్పలేకపోయాడు.

ఆయన కొట్టలేదు. తిట్టలేదు. తన దగ్గరకొచ్చి ప్రేమగా తన భుజం మీద చెయ్యివేసి-

"ఎక్కాలు రాకపోతే ఎలారా ప్రసాదు ? రేపటినుండి రోజుకో ఎక్కం చదివినాకు చెప్పరా!" అన్నారు నవ్వుతూ.

ఆయన మాటతీరుకు, ఆ నవ్వుకు తను కట్టుబడిపోయాడు.

"ఒరేయ్ అబ్బాయిలూ ! తిండిదగ్గర, చదువు దగ్గర మొహమాటం పనికిరాదురా! తిండి సరిగ్గా తినకపోతే శరీరం నీరసించిపోతుంది. చదువు దగ్గర బిడియపడితే బుర్ర పెరగదు. తెలిసిందా?"

ఆ మాటలు తనకు ఎప్పుడూ జ్ఞాపకం వస్తుండేవి.

తనకు లెక్కలు రావని తెలుసుకొని బసవయ్య బాబాయ్, మాస్టారు దగ్గర ట్యూషను ఏర్పాటు చేశాడు. అదే తనకూ, మాస్టారుకూ విడదీయరాని బంధాన్ని వేసింది.

ఆ ఏడు తను ఫస్టుక్లాసులో పాసయ్యాడు. లెక్కల్లో నూటికి నూరు వచ్చాయి. మరుసటేడు పక్కూళ్ళో వున్న హైస్కూల్లో చేరాడు.

దుర్గాప్రసాదు సైకిలు గోతిలో పడింది! అతడు పడబోయి గట్టిగా బ్రేకులు వేసి నిలత్రొక్కుకున్నాడు. గోతిని తప్పించి మెల్లగా తొక్కసాగాడు.

"ఒరేయ్ ప్రసాదూ! ఈ ఏడునుండే పక్కవూళ్ళో వున్న హైస్కూలు కెళ్ళబోతున్నావు! దారిలో ఎన్నెన్నో గోతులుంటాయి. చూసుకెళ్ళాలిరా!"

"అలాగే మాస్టారూ! గోతులువస్తే దూకేస్తాలెండి!" అన్నాడు తను గొప్పగా.

ఆయన నవ్వారు.

కాలేజీలో కూడా తను లెక్కల గ్రూపే తీసుకున్నాడు.

తనకు లెక్కలంటే మంచినీళ్ళప్రాయమై పోయింది. స్కూలు మారినా మాస్టారి దగ్గర ట్యూషను మారలేదు !

"ఒరేయ్ ప్రసాదు ! జోకులుగానీ లెక్కలు గానీ చెప్పగానే ఎదుటిమనిషి బుర్రకెక్కాలిరా ! లేకపోతే ఆ చెప్పేవాడు ఒట్టి దద్దమ్మ! ఇంతకీ నేను మాస్టారినా, దద్దమ్మనా?" అన్నారు.

"మాస్టారూ ! మీరు మాస్టారేనండీ?"

కాలేజీలో ఇంటర్‌లో చేరాక మాస్టారి దగ్గరకు వెళ్ళాడు.

"ప్రసాదూ! నువ్వు ఇంజనీరువై మనవూరికి మంచిరోడ్డు వేయించాలిరా!" అన్నారు మాస్టారు.

" ఉహు ! లేదు మాస్టారూ ! మీకొక మంచి ఇల్లు కట్టిస్తాను!"

మాస్టారు తనని దగ్గరకు తీసుకుని-

"అంతమాటన్నావు! అది చాలురా ఈ బీదమాస్టారికి" అన్నారు ప్రేమగా.

తను ఇంటరు చదువుతున్నప్పుడే అన్నయ్యకు వైజాగ్‌లో వుద్యోగం వచ్చింది.

అమ్మ ఇక్కడి పొలాలు బసవయ్య బాబాయికి అప్పచెప్పి అన్నయ్యతోపాటు వెళ్ళింది !

ఇంటరయ్యాక ఇంజనీరింగులో చేరాలనుకున్నాడు కానీ అన్నయ్య బి.కాంలో చేర్పించాడు.

ఆవులగుంపు సైకిలుకు అడ్డురావడంతో బ్రేకు వేశాడు దుర్గాప్రసాద్! దానితోపాటు అతని ఆలోచనలకు కూడా బ్రేకుపడింది.

చుట్టూ చూశాడు!

రెండుగజాల దూరంలో వూరు కన్పించింది.

అణువణువునా ఏదో" తెలీని ఆనందం పొంగిపొరలింది ! తన జీవితంలోని ఎన్నో ముఖ్యమైన ఘట్టాలకు ఇదే రంగస్థలం.

తనిక్కడే కళ్ళు తెరిచాడు. తన తండ్రి ఇక్కడే చనిపోయాడు. తన బుద్ధి రేకులు విప్పింది ఇక్కడే.

ఊరిపొలిమేరల్లోకి అడుగుపెట్టాడు. ఊరేమీ పెద్దగా మారినట్లు అన్పించలేదు!

ఊరి మొదట్లో అన్నీ పాకలే వుండేవి. ఇప్పుడు రెండు, మూడు పెంకుటిళ్ళు కన్పిస్తున్నాయి.

గుడిసెలముందు పిల్లలు గోలీకాయలు ఆడుతున్నారు.

వాళ్ళని దాటివెళ్ళాడు.

డాబా ఇళ్ళు కన్పించాయి.

వాటి ప్రక్కన టీస్టాల్ చిన్న టూరింగ్ టాకీస్......

ఇప్పుడిప్పుడే నాగరకతనీడలు ముసురుకుంటున్నాయి అనుకున్నాడు దుర్గాప్రసాద్!

వాటిని దాటి వెళ్ళగానే రామాలయం. ఆ పక్కనే తన బడి కన్పించాయి.

అదిప్పుడు హైస్కూలు అయింది.

మనస్సు మళ్ళీ చిన్నతనంలోకి వెళ్ళబోయింది. కానీ ఆకలి, నీరసం. ఆ ఆలోచనల్ని మరలించాయి.

దుర్గాప్రసాద్ వీధి మలుపు తిరిగాడు.

ఎదురుగా పరమేశం మాస్టారి ఇల్లు.

ఊరు అభివృద్ధి చెందుతోంది. కానీ మాస్టారి ఇల్లు ఇంకా ఇంకా భూమిలోకి క్రుంగిపోతోంది.

దుర్గాప్రసాద్ ఇంటి దగ్గరగా వచ్చాడు.

ఎప్పటిదో తాతలనాటి పెంకుటిల్లు. అక్కడక్కడ పెంకులెగిరిపోయాయి. చాలాచోట్ల వాసాలు క్రుంగాయి. ఇల్లు ఒక ప్రక్క ఒరిగిపోయి వుంది.

ఆ ఇంటిని చూడగానే దుర్గాప్రసాద్ మనస్సు ద్రవించిపోయింది.

సైకిలు దిగి స్టాండువేశాడు. మెల్లగా మెట్లెక్కాడు. ఈ ఇంటిమెట్లు ఎన్నోసార్లు ఎక్కాడు. ప్రతిసారీ మనస్సు చిత్రమైన స్పందనకు లోనవుతుంది ఎందుకో.

తలుపు తట్టాడు. పాతికేళ్ళ అమ్మాయి తలుపు తీసింది.

"మాస్టారున్నారాండీ"

ఆ అమ్మాయి సమాధానం చెప్పకుండా ప్రసాద్‌వేపు బిత్తరపోయి చూడసాగింది?

"మాస్టారు వున్నారాండీ?" మళ్ళీ అడిగాడు.

ఇంతలో లోపలినుండి ఒక ముసలావిడ వచ్చింది.

"లేరు ! సాయంత్రం వస్తారు!"

దుర్గాప్రసాద్ మళ్ళీ సైకిలెక్కి బసవయ్య బాబాయ్ ఇంటివేపు వెళ్ళాడు.

* * *

ప్రొద్దు పడమరకు వాలిపోతోంది.

దుర్గాప్రసాద్ మామిడిచెట్టు క్రింద మంచం మీద కూర్చుని ఫలహారం చేస్తున్నాడు.

ఆ ప్రక్కనే మరో మంచంమీద కూర్చున్న బసవయ్య "ఏరా ప్రసాదూ! కోడలూ మనవరాలు బాగున్నారా?" అనడిగాడు.

"ఆ."

"నువ్వీవూరు వచ్చి చాలాకాలమైందిరా. అబ్బాయ్"

"అవును బాబాయ్ అయిదేళ్ళవుతోంది"

దుర్గాప్రసాద్ పళ్ళెం క్రిందపెట్టి మంచినీళ్ళు త్రాగాడు.

"ఏరా అబ్బాయ్! పొలం అమ్మాల్సిందేనంటావా!"

"అవసరం బాబాయ్! హైద్రాబాద్‌లో స్థలం కొని ఇల్లు కట్టుకోవాలనుకుంటున్నాను. ఈ పొలం పెద్దగా మనకేం పంట ఇవ్వడంలా. ఒట్టి శ్రమ మిగుల్తోంది. అందుకే అమ్మాలనుకుంటున్నా!"

"సరే. నీ యిష్టం" నిట్టూరుస్తూ అన్నాడు.

"బాబాయ్ నేను మాస్టారింటి కెళ్ళొస్తాను. ఈ లోపు మధ్యవర్తి వస్తే నువ్వు మాట్లాడు!" అన్నాడు మంచంమీద నుండి లేస్తూ.

"అలాగేరా"

దుర్గాప్రసాద్ పరమేశం మాస్టారింటికి బయలుదేరాడు.

దుర్గాప్రసాద్ వెళ్ళేసరికి మాస్టారు అరుగుమీద కూర్చుని వున్నారు.

"ప్రసాద్! రావోయ్ రారా" సంభ్రమంగా ఆహ్వానించారు.

దుర్గాప్రసాద్ వెళ్ళి ఆయన ప్రక్కన చాపమీద కూర్చున్నాడు.

"మాస్టారూ నన్ను గుర్తుపట్టరనుకున్నాను!"

"అదేం మాటోయ్! నిన్ను మర్చిపోతే- నన్ను నేను మర్చిపోయినట్లే!"

అదే ఆప్యాయత అభిమానం మాస్టారేవీ మారలేదు.

"మాస్టారూ నేనంటే మీకెందుకింత అభిమానం" చిన్నప్పట్నించీ అడగాలనుకున్న ప్రశ్న ఇన్నాళ్ళకి అతని నోటివెంట వచ్చింది.

మాస్టారు నవ్వారు.

"అభిమానానికి కారణం వుండదు ప్రసాద్. బహుశ మనది జన్మజన్మల అనుబంధమై వుంటుదోయ్!" ఆప్యాయంగా దుర్గాప్రసాద్ భుజంపై చెయ్యివేశారు మాస్టారు.

"మాస్టారూ! మీరు చాలా చిక్కిపోయారు"

"చిక్కిపోక ఈ వయసులో బలుస్తానా ఏవిటోయ్ నీపిచ్చిగానీ!"

దుర్గాప్రసాద్ ఆయనవేపే చూస్తూ వుండిపోయాడు.

"ప్రసాద్? నువ్వెంతో అభిమానంతో అంత దూరంనుండి వస్తే నీకు కాఫీ కూడా ఇవ్వలేకపోతున్నానోయ్"

"ఛ అలా అనుకోకండి మాస్టారూ. నాకు మీ అభిమానం చాలు" అన్నాడు దుర్గాప్రసాద్!

ఆ క్షణంలో అతనికి ఈ అరుగుమీద కూర్చుని తను నేర్చుకున్న పాఠాలు తను తిన్న ఫలహారాలు జ్ఞాపకం వచ్చాయి. ప్రతిరోజూ మాస్టారు తనకేదో ఒకటి పెట్టేవారు. ఇంట్లో ఫలహారం లేని రోజున అటుకులు బెల్లం కలిపి తెచ్చి తినమనేవారు.

"వద్దు మాస్టారూ." అంటే

"అలా అనకోయ్ నీకు నాచేత్తో పెడితే తృప్తి" అనేవారు.

"ప్రసాద్ అందరూ కులాసానా"

మాస్టారి ప్రశ్నకు వులిక్కిపడి "ఆ! ఆ!" అన్నాడు.

"ఏమిటోనోయ్ ప్రసాద్ ఈ మధ్య చాలా విరక్తిగా వుంటోందోయ్!"

దుర్గాప్రసాద్ నివ్వెరపోయాడు.

మాస్టారేనా ఇలా మాట్లాడేది ?

కష్టాల్లో కూడా నవ్వే మాస్టారు, నవ్వుకు ప్రతిరూపంగా వుండే మాస్టారు, ఎదుటివారి బాధల్ని తన జోకులతో మైమరపింపజేసే మాస్టారేనా ఇలా దయనీయంగా మాట్లాడేది.

మాస్టారు శారీరకంగానే కాకుండా మానసికంగా కూడా చాలా మారారన్నమాట!

ఎందువలన వచ్చిందో ఈ మార్పు? మంచు తుఫానులో చెక్కుచెదరక నిలిచే హిమవన్నగంలా, ఉండే మాస్టారు ఎందుకిలా ఉన్నారో!

"మాస్టారూ! మీరు దేనికో బాధపడుతున్నట్లున్నారు. కారణం ఏమిటి మాస్టారూ?" దుర్గాప్రసాద్ అడిగాడు.

మాస్టారు నవ్వారు. సర్వం కోల్పోయిన వ్యక్తి నవ్విన నవ్వులా వుందది.

దుర్గాప్రసాద్ మనస్సు చివుక్కుమంది. అర్థరాత్రి అమృతం కురిసినట్లు, పాలరాతిపై ముత్యాలు రువ్వినట్లు-చల్లగా, హాయిగా వుండే ఆ నవ్వు ఏదీ! ఏమైంది?

మాస్టారి నవ్వు ఎందరికో అసూయ కలిగించింది. వారిలో ఎందరు 'మాస్టారూ! మీకేమీ కష్టాలు లేవా? అనడిగేవారు.

మాస్టారు హాయిగా నవ్వేస్తూ "ఎందుకుండవండీ! మనిషన్నాక కష్టాలు లేకుండా ఉంటాయా?" అని ఎదురుప్రశ్న వేసేవారు.

"అయితే ! మీరు....."

మాస్టారు నవ్వి " బాధపడితే కష్టాలు తొలగిపోతాయా?" అనేవారు.

ఆ మాటలు వాళ్లకు అర్థమయ్యేవి కావు. ఏ చిన్న కష్టమొచ్చినా రోజుల తరబడి బాధపడే ఈ మనుషులు మాస్టారిలా నవ్వలేక - నవ్వడం చేతకాక ఈర్ష్యాసూయలతో బాధపడేవారు.

" ప్రసాద్ ! పొద్దున్న వచ్చింది నువ్వేనా"

"అవునండీ ! కానీ మీరు లేరు"

" ఒక పనిమీద తిరుగుతున్నాను" అని వూరుకున్నారు.

ఇంతలో ఒక ముసలావిడ రెండు గ్లాసుల్తో వచ్చింది.

" తీసుకోవోయ్ ఇదే నీకు ఈ బీదమాష్టారిచ్చే ఆతిథ్యం" దిగులుగా నవ్వుతూ అన్నారు.

దుర్గాప్రసాద్ ఎంతో ఆప్యాయంగా త్రాగాడు.

మరో పదినిమిషాలు కూర్చుని, " మాష్టారూ రేపు కలుస్తానండీ" అని చెప్పి ఇంటివేపు నడక సాగించాడు.

మాష్టారి బాధేమిటో! అయన చెప్పరు. ఆయనకి అభిమానం ఎక్కువ. ప్రాణం పోతున్నా పెదవి విప్పరు.

ఎలా తెలుసుకోవడం.

బాబాయ్ కేమన్నా తెలుసేమో!

గబగబా అడుగులు వేశాడు దుర్గాప్రసాద్.

* * *

ఆ రాత్రి బాబోయ్ నోటివెంట-మాష్టారిబాధకు గల కారణాన్ని తెలుసుకుని - దుర్గాప్రసాద్ ఆశ్చర్యపోయాడు.

మాష్టారి బాధకు ఇదా కారణం. పెద్దకొడుకు వుద్యోగం లేక ఇంట్లోంచి పారిపోయినపుడు ఆయన ఏడవలేదు.

రెండోకొడుకు చదువు సంధ్యల్లేక రౌడీగా తిరిగినా బాధపడలేదు.

పెద్దకూతురు ఎవడి వలలోనోపడి మోసపోయి ఆత్మహత్య చేసుకున్నా, రెండో కూతురు టైలరు కొట్లో పనిచేసే కుర్రాడితో లేచిపోయినా ఏడవలేదు.

ఇన్ని కష్టాలు భరించలేక ఆయన భార్య గుండె ఆగి చనిపోయినా నవ్వారు.

కానీ ఇప్పుడు.....

తన తాత తండ్రికి - తండ్రి తనకు అప్పజెప్పిన వారసత్వపు ఇంటిని అమ్మవలసి వచ్చినందుకు కుమిలిపోతున్నాడాయన.

తన తాత - తండ్రి చనిపోయిన ఇంట్లోనే తాను కూడా కన్ను మూయలేక పోతున్నందుకు బాధపడుతున్నాడు.

" ఎందుకమ్ముతున్నారు?" దుర్గాప్రసాద్ అడిగాడు.

"ఏడాదిక్రితం అతికష్టంమీద ఆఖరి కూతురుకు పెళ్ళిచేశాడు. అల్లుడికి రెండువేలు కట్నం ఇస్తానన్నాడు. కానీ ఇవ్వలేక పోయాట్ట. వారం రోజులక్రితం అల్లుడొచ్చి ఇచ్చినమాట తప్పుతున్నారు అన్నాడు. దానికాయన అభిమానపడి ఇల్లు అమ్ముతున్నాడు.

" కేవలం రెండువేలకోసమా?"

"అవును. ఆ ఇంటిమీద ఇప్పటికే చాలా అప్పు ఉంది. శెట్టి ఊరుకోవడం లేదు. ఎల్లుండి సాయంత్రమే స్వాధీనం చేసుకుంటున్నాడు" బసవయ్య అన్నాడు.

దుర్గాప్రసాద్ మనస్సు విలవిలాడింది. "బాబాయ్ ! పోనీ ఎవరయినా సహాయం చేయొచ్చుగా"

"ఎవర్నీ అడగడు. అడగందే ఎవరుసహాయం చేస్తారు. అందునా ఈరోజుల్లో" అవును. ఎవ్వరూ ఇవ్వరు. ఎవరికేమవసరం ?

కానీ - తనకు అవసరం. ఆ బాధ్యత తనకుంది. ఆ ఇల్లు ఆయనకు నిలపాలి.

ఒకప్పుడు......

"మాష్టారూ ! మీకొక మంచి ఇల్లు కట్టిస్తాను" అని చెప్పాడు.

ఇల్లు కట్టించి ఇవ్వలేకపోయాడు కనీసం ఈ ఇల్లయినా ఆయనకు ఇవ్వాలి.

ఆ రాత్రల్లా ఆలోచనల్తో సతమతమయ్యాడు దుర్గాప్రసాద్.

* * *

మర్నాడంతా దుర్గాప్రసాద్ తన పొలం అమ్మకం విషయంలో తిరుగుతూ మాష్టారిని కలవలేకపోయాడు.

ఆ సాయంత్రం పొలం అమ్మకం జరిగి దుర్గాప్రసాద్ చేతికి డబ్బు వచ్చింది.

ఆ డబ్బుని చూడగానే దుర్గాప్రసాద్‌కి మాష్టారి దీనవదనం కళ్లముందు మెదిలింది.

మాష్టారూ ! మీ కళ్ళలో నీళ్ళు నేను చూడలేనండీ. నవ్వే మీ పెదవులు దు:ఖంతో వణికిపోతే నేను భరించలేను మాష్టారూ. మీ ముఖంలో చిరునవ్వు సదా వెలుగుతుండాలి. ఆ వెలుగు లోకాన్ని వెలిగిస్తుండాలి మాష్టారూ! మీరభిమానించే ఈ శిష్యుడు మీకు గురుదక్షిణ ఇస్తున్నాడు. స్వీకరించండి" ఆనందంగా అనుకున్నాడు.

ఎప్పుడెప్పుడు తెల్లవారుతుందా అని ఎదురు చూడసాగాడు దుర్గాప్రసాద్.

మర్నాడు వుదయమే శెట్టి దగ్గరకు వెళ్లాడు దుర్గాప్రసాద్.

* * *

శెట్టికివ్వాల్సిన డబ్బు వడ్డీతో సహా కట్టేశాడు.

అప్పటికి వుదయం తొమ్మిదిగంటలయింది.

ఆ కాగితాలు తీసుకుని మాష్టారింటికి వుత్సాహంగా బయలుదేరాడు దుర్గాప్రసాద్.

ఇంటిని సమీపించేసరికి ఇంటిముందు చిన్నగుంపు కన్పించింది.

దుర్గాప్రసాద్ మనస్సు కీడుని శంకించింది.

గుంపుని తప్పించుకుని ముందుకు వెళ్ళాడు.

ఎదురుగా కన్పించిన దృశ్యాన్ని చూడగానే అతని శరీరం జల్లుమంది.

పరమేశం మాష్టారు చాపమీద పడుకుని వున్నారు ఆయన శరీరంలోని పంచప్రాణాలు పంచభూతాల్లో కలిసి చాలాసేపయింది.

కానీ ఆయన ముఖం ఎంతో ప్రశాంతంగా వుంది.

ఆయన పెదవులపై చిరునవ్వు దీపంలా వెలుగుతోంది.

ఆ వెలుగుల లోకాన్ని వెలిగిస్తున్నాయి.

"ప్రసాద్ ! నువ్వు నాకోసం డబ్బు, ఖర్చు పెట్టావ్ కదూ ! నా స్వభావం తెలిసి కూడా నువ్వాపని చేశావంటే నాకు చాలా బాధగా వుందోయ్" అంటున్నట్లుగా తోచింది దుర్గాప్రసాద్‌కి.

"ప్రసాద్ నేను కోరుకున్నట్లుగానే స్వంత ఇంట్లో చని పోయానోయ్. చూశావా" అంటున్నారు మాష్టారు.

దుర్గాప్రసాద్ బాధతో తల తిప్పుకున్నాడు.

"మావగారు పోగానే ఆ పిచ్చికోడలు ఎక్కడికో పారిపోయిందండీ. పాపం ఆ నాలుగేళ్ళ కుర్రాడు అమ్మకోసం ఎలా ఏడుస్తున్నాడో" అంటున్నారెవరో.

అది విని దుర్గాప్రసాద్ లోపలికెళ్ళి ఆ కుర్రాడిని ఎత్తుకున్నాడు.

* * *

రెండ్రోజుల తర్వాత కుర్రాడితో ఇంటికొచ్చాడు దుర్గాప్రసాద్.

"డబ్బేదండీ" భార్య ఎదురొచ్చి అడిగింది.

"ఇదుగో" అంటూ కుర్రాడిని చూపాడు.

ఆవిడ నివ్వెరపోతూ "ఇదేమిటండీ వీడినెవడినో తెచ్చారు" అంది.

"ఇది జన్మజన్మల బంధం" అంతకన్నా చెప్పే ఓపికలేక కుర్చీలో కూర్చుండిపోయాడు దుర్గాప్రసాద్.